క్లుప్తంగా

తొలిమెట్టుతో ఉత్తమ ఫలితాలు



స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో టీచర్లు

మల్లాపూర్: ప్రభుత్వం పాఠశాలల్లో అమలు చేసిన తొలిమెట్టు ఉత్తమ ఫలితాలను ఇస్తుందని స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం పిన్నంశెట్టి శ్రీనివాస్ అన్నారు. మండలంలోని చిట్టాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన ప్రాథమిక స్థాయి స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో పాల్గొని మట్లాడారు. తొలిమెట్టు కార్యక్రమాలను విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించి వారి ప్రోత్సాహాన్ని పొందాలన్నారు. విద్యార్థులకు 3 ఆర్స్ నేర్పించుటకు మెళకువలపై ఉపాధ్యాయులకు స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో వివరించడం జరిగిందన్నారు. సమావేశంలో రిసోర్స్ పర్సన్లు మహేశ్, రాజేశ్, చిరంజీవి,, సీఆర్పీ విజయ్‌ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలు నచ్చి కాంగ్రెస్‌లో చేరిక

ఇబ్రహీంపట్నం: కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ఆరు గ్యారంటీ పథకాలు నచ్చి కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు ఎంపీటీసీలు తెలిపారు. మండలానికి చెందిన ఎంపీటీసీలు పొనకంటి వెంకట్, పడాల మమత, దొెట్టి శాంత, బొరిగం వివేకవర్ధిని, తిమ్మణి రాములు, నాయకులు బొరిగం మహేశ్, దొెట్టి రాజరెడ్డి బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి గాంధీ భవన్‌లో రాష్ట్ర కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్ గౌడ్, కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛమైన నీటితోనే సంపూర్ణ ఆరోగ్యం



వాటర్ ప్లాంట్ ప్రారంభిస్తున్న చైర్మన్

జగిత్యాలటౌన్: స్వచ్ఛమైన నీటిని తీసుకుని ఆరోగ్యంగా ఉండాలని బల్దియా చైర్మన్ గోలి శ్రీనివాస్ అన్నారు. శివవీధి ఆర్యవైశ్య సేవా సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని టవర్ సర్కిల్ శివ వీధిలో ఏర్పాటు చేసిన శుద్ధ జల ప్లాంటును మంగళవారం ప్రారంభించి మాట్లాడారు. ప్రజల తాగునీటి అవసరాలు తీర్చేందుకు శుద్ధజల ప్లాంటును ఏర్పాటు చేసిన ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులను అభినందించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు కప్పల శ్రీకాంత్, బొడ్ల జగదీశ్వర్, సంఘం గౌరవ అధ్యక్షుడు ఊటూరి శ్రీనాథ్, అధ్యక్షుడు ఊటూరి మహేశ్, జ్ఞానప్రకాష్, సామ సునీల్ కుమార్, ఎన్నాకుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

రుణాలను సకాలంలో చెల్లించాలి



చెక్కు అందిస్తున్న డీసీఎంఎస్ చైర్మన్

ధర్మపురి:రైతులు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలని ఉమ్మడి జిల్లా డీసీఎమ్మెస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. ధర్మపురిలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన చెక్కుల పంపిణీకి హాజరయ్యారు. సుమారు రూ.4లక్షల విలువైన చెక్కులను పంపిణీ చేశారు. సంఘం ద్వారా అందిస్తున్న రుణాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంకు మేనేజర్ లక్ష్మి, డీసీఎమ్మెస్ మేనేజర్ వెంకటేశ్వర్‌రావు, సీఈవో రాజేశ్ పాల్గొన్నారు.

వైద్యులను నియమించాలని వినతి

రాయికల్: పట్టణంలోని ఆస్పత్రిలో వైద్యులను నియమించాలని రాయికల్ ఆస్పత్రికి వచ్చిన జిల్లా సూపరింటెండెంట్ సుదక్షిణదేవిని కాంగ్రెస్ నాయకులు కోరారు. ఆస్పత్రిలోని సమస్యలను వివరించారు. వైద్యులను త్వరితగతిన నియమించి రోగులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు మ్యాకల రమేశ్, నాయకులు కొయ్యడి మహిపాల్‌రెడ్డి, ఎద్దండి దివాకర్, షాకీర్, నరేశ్, బత్తిని భూమయ్య, దాసరి గంగాధర్, బత్తిని నాగరాజు, పొన్నం శ్రీకాంత్, రాకేశ్‌నాయక్ పాల్గొన్నారు.

ఆరుతడి పంటలకు కోతుల బెడద

- కోతులను తరిమేస్తేనే పంటల సాగంటున్న రైతులు
- జిల్లాలో ఏటా కోతులతో రూ. 50 కోట్ల వరకు పంట నష్టం



కుక్కలతో పంటను కాపలా కాస్తున్న రైతులు



పంటపై దాడి చేస్తున్న కోతుల గుంపు

జగిత్యాలఅగ్రికల్చర్: ఆరుగాలం శ్రమించి పంటలు పండిస్తున్న రైతన్నలకు కోతులు చుక్కలు చూపెడుతున్నాయి.రాత్రింబవళ్లు కష్టపడి పంట పండించడం ఒక ఎత్తైతే, కోతుల నుంచి ఆ పంటలను కాపాడుకోవడం రైతులకు తలకుమించిన భారమవుతోంది. జిల్లాలోని రైతులు యాసంగి సీజన్‌లో వరితో పాటు ఆరుతడి పంటలు మొక్కజొన్న, వేరుశనగ, అలిసెంత, మినుము, పెసర పంటలను సాగు చేయగా, ఆ పంటలు గింజ దశకు చేరుకోగా, కోతులు నాశనం చేస్తున్నాయి. దీంతో రైతులు తమ పనులు విడిచిపెట్టి కుక్కలు, కట్టెలు పట్టుకుని పంటకు కాపాలా వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. ఒక్క జిల్లాలోనే ప్రతి ఏడాది రూ. 50 కోట్ల వరకు పంట నష్టం జరుగుతోందని, ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని రైతులు కోరుతున్నారు.

సంతతి వృద్ధి చేస్తున్న వానరాలు..

కోతులకు ఆహారం అందక అవి పంట పొలాల్లోకి వస్తున్నాయి. అడవులు తగ్గిపోవడం, ఉన్న అడవుల్లోనూ పరిమిత ఆహారం, నీరు దొరకని స్థితి, కఠినమైన పరిస్థితులతో వాటి సంతతి అంతగా వృద్ధి చెందదు. కానీ జనావాసాల్లో, రైతుల పంట పొలాల్లో కోతులకు తేలిగ్గా ఆహారం దొరుకుతోంది. దీంతో వాటి సంతతి విపరీతంగా పెరుగుతోంది. జిల్లాలోనే పదేళ్లలో కనీసం ఐదు రేట్లు కోతులు తమ సంతతిని వృద్ధి చేశాయి. కోతుల జనాభాను నియంత్రించేందుకు వాటిని పట్టుకుని కుటుంబ నియంత్రణ చికిత్సలు చేస్తున్నప్పటికీ, సరైన ఫలితాలు రావడం లేదు.

ఆరుతడి పంటలు వేయాలంటేనే భయం..

కోతుల బెడద రైతులకు కునుకు లేకుండా చేస్తోంది. వేరుశెనగ పంట గింజలను తెంపే దశకు చేరుకోగానే, కోతుల బెడద తీవ్రమైంది. జగిత్యాల జిల్లాలో ఎక్కువగా గుట్టలు ఉన్న ప్రాంతం కావడంతో మొక్కజొన్న, వేరుశనగ పంటలు వేయాలంటేనే ఇక్కడి రైతులు భయపడే పరిస్థితి ఉంది. మందల కొద్ది వస్తున్న కోతులు మూడు నెలల పాటు పండించిన పంటను, మూడు నిమిషాల్లో సర్వనాశనం చేస్తున్నాయి. కోతుల భయంతో మొక్కజొన్న, వేరుశెనగ వేసిన రైతులు ఉదయం, సాయంత్రం కాపాలాకు వెళ్లాల్సిన పరిస్థితి. రైతుల చేతిలో కర్ర లేకపోతే వారిపైనే దాడి చేస్తున్నాయి.

కోతులను ఎదుర్కొనేందుకు తంటాలు..

చాలా గ్రామాల్లో రైతులు తోటల నుంచి కోతులను తరిమేందుకు సోలార్ కంచెలు ఏర్పాటు చేస్తున్నారు. కొందరు కొండముచ్చులు పెంచడం, ఎలుగుబంట్ల వేషాల బొమ్మలు పెడుతున్నారు. దీనికి తోడు, కోతులను తరిమేందుకు కొంతమంది రైతులు కుక్కలను సైతం పెంచుతున్నారు. ఒక్క జగిత్యాల మండలం లక్ష్మీపూర్‌లోనే 20 వరకు కుక్కలను పెంచుతున్నారు. కుక్కలకు కోతులు కనబడగానే, వాటి వెంబడి పరుగెత్తి మొరుగుతుండటంతో వెళ్లిపోతుంటాయి. అలాగే మరికొంత మంది రైతులు సెల్‌ఫోన్లలో కుక్కల అరుపులను రికార్డు చేసి, తోటలో చెట్లకు మైక్‌లు కట్టి కోతులను వెళ్లగొట్టే ప్రయత్నం చేస్తున్నారు. అలాగే, రైతులు మొక్కజొన్న తోటల చుట్టు వలలు, చీరలు ఏర్పాటు చేసుకుంటున్నారు. మరికొన్ని ప్రాంతాల్లో కోతులు వచ్చిన ప్పుడు టపాకాయలు పేల్చినా వాటిని అదుపు చేయడం రైతులకు కష్టంగా మారుతోంది. పంటలను కోతుల బారి నుండి కాపాడేలా శాస్త్రవేత్తలు పరిశోధనలు చేయాలని, ప్రభుత్వం ఆలోచనలు చేయాలని రైతులు కోరుతున్నారు.

పంట వేసినప్పటి నుంచి కాపలా



ఎకరంలో వేరుశనగ పంట వేశాను. ఇప్పటికే నెల రోజుల నుంచి కోతులు రాకుండా ప్రతీ రోజు కాపలా ఉంటున్నాం. ఇప్పుడే పంట గింజ దశకు చేరుకుంటోంది. ఒక్క రోజు కాపలా లేకపోతే పంటను నాశనం చేస్తున్నాయి.

– తీపిరెడ్డి శేఖర్, వేరుశనగ రైతు

కోతులతో పంటలు ధ్వంసం



కోతులతో వేరుశనగ పంట ధ్వంసం అవుతోంది. కుటుంబసభ్యుల్లో ఎవరో ఒక్కరం కాపాలా వెళ్లుతున్నాం. మాపై దాడి చేస్తుండటంతో కుక్కలను వెంట తీసుకెళ్లుతున్నాం. పంట చేతికొచ్చే వరకు కష్టంగానే ఉంది.

– కొట్టాల మోహన్ రెడ్డి, లక్ష్మీపూర్, మొక్కజొన్న రైతు

నిర్మాణంలో ఉన్న రైస్‌మిల్లుకు ధాన్యం కేటాయింపు

- కోళ్ల ఫారంలో ధాన్యం నిల్వ
- మంత్రికి ఫిర్యాదు చేసిన స్థానికుడు



తిమ్మాపూర్ కోళ్లఫారంలో ధాన్యం బస్తాలు



నిర్మాణంలో ఉన్న రైస్‌మిల్

ఇబ్రహీంపట్నం: మండలంలోని తిమ్మాపూర్‌లో నిర్మాణంలో ఉన్న ఓ రైస్‌మిల్లుకు అధికారులు ధాన్యం కేటాయించారని, సదరు అధికారులపై చర్యలు తీసుకోవాలని మాజీ ఉప సర్పంచ్ సల్ల సునీల్ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి విన్నవించారు. గ్రామంలో మాజీ ఎంపీపీ నేరేళ్ల దేవేందర్ శ్రీ వెంకటలక్ష్మీనర్సింహ ఇండస్ట్రీస్ పేరిట రైస్‌మిల్ నిర్మిస్తున్నాడు. ఆ మిల్లులో ధాన్యం నిల్వ చేసే అవకాశమే లేదు. కనీసం విద్యుత్ సౌకర్యం కూడా లేదు. అయినప్పటికీ అధికారులు ఆ మిల్లుకు వానకాలంలో రైతులు పండించిన ధాన్యాన్ని కేటాయించారు. దేవేందర్ భార్య హేమలత సర్పంచ్ కావడంతో గ్రామ పంచాయతీ నుంచి అనుమతి తీసుకుని మిల్లు నిర్మాణం పూర్తికాకున్నా సుమారు 22వేల క్వింటాళ్ల ధాన్యాన్ని కేటాయించుకున్నారు. మిల్ నిర్మాణం పూర్తి కాకుండానే ధాన్యం అలాట్‌మెంట్ చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని మంత్రితోపాటు సివిల్ సప్లయ్ కమిషనర్ దేవేంద్రచౌహాన్‌కు సునీల్ ఫిర్యాదు చేశారు. ధాన్యం బస్తాలను ఇతర రైస్‌మిల్‌కు బదిలీ చేయాలని కోరారు.

వేతనాల కోసం మున్సిపల్ కార్మికుల ఆందోళన

మెట్‌పల్లి: వేతనాలు చెల్లించాలంటూ మున్సిపల్ కార్మికులు మంగళవారం కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. ఉదయం ఐదు గంటలకు విధులకు వచ్చిన కార్మికులు..తమకు రెండు నెలల వేతనాలు, పీఆర్సీ బకాయిలు చెల్లిస్తేనే పనులు చేస్తామంటూ అధికారులకు తెలిపారు. దీనికి వారి నుంచి స్పందన రాకపోవడంతో కార్యాలయం ఎదుట బైఠాయించి ఆందోళన చేపట్టారు. సంక్రాంతి పండుగను దృష్టిలో పెట్టుకోనైనా వేతనాలు, పీఆర్సీ బకాయిలు చెల్లించి ఆదుకోవాలని, పండగపూట కార్మికులను పస్తులు ఉంచొద్దని కోరారు. వీరికి పలువురు కౌన్సిలర్లు సంఘీభావం తెలిపారు. సుమారు నాలుగు గంటల పాటు బైఠాయించిన కార్మికులు అక్కడే వంటా–వార్పు చేశారు. చివరకు కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్ వచ్చి రెండు రోజుల్లో ఒక నెల వేతనం చెల్లిస్తామని, సంక్రాంతి తర్వాత మరో నెల బకాయి ఇస్తామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు.



కార్యాలయం వద్ద బైఠాయించిన కార్మికులు

వేతనాల కోసం కమిషనర్‌కు వినతి

కోరుట్ల: తమకు గత రెండు నెలలుగా వేతనాలు లేక ఇబ్బందులు పడుతున్నామని వెంటనే వేతనాలు విడుదల చేయాలని మున్సిపల్ పారిశుధ్య కార్మికులు మంగళవారం కమిషనర్ రాజేశ్వర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ నెల 11వ తేదీ వరకు వేతనాలు చెల్లించకుంటే 12వ తేదీ నుంచి విధులు బహిష్కరిస్తామని వినతి పత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

ఆరోగ్య సమాజమే లయన్స్‌క్లబ్ ధ్యేయం

మల్లాపూర్: ఆరోగ్య సమాజ నిర్మాణమే లయన్స్‌క్లబ్ ధ్యేయమని, గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించడం అభినందనీయమని లయన్స్ క్లబ్ రీజియన్ చైర్మన్ శివ శ్రీనివాస్ అన్నారు. మండలంలోని గొర్రెపల్లిలో మంగళవారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా ఉచిత కంటి వైద్య శిబిరాన్ని లయన్స్ అధ్యక్షుడు కనుక సంజీవ్‌తో కలిసి ఆయన ప్రారంభించి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాలలో నిరుపేదల కోసం ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించడం సామాజిక బాధ్యతగా అభివర్ణించారు. కార్యక్రమంలో సర్పంచ్ కొంపెల్లి సరోజన, ఉపసర్పంచ్ కదుర్క గంగనర్సయ్య, లయన్స్‌క్లబ్ రీజినల్ కార్యదర్శి రుద్ర రాంప్రసాద్, క్లబ్ కార్యదర్శి తోట రాజరెడ్డి, కోశాధికారి ఇర్రి జైపాల్‌రెడ్డి, ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు ముత్యాల రమేశ్, నాయకులు గ్రామస్తులు పాల్గొన్నారు.



వైద్య శిబిరంలో వృద్ధురాలిని పరీక్షిస్తున్న డాక్టర్లు

ఘనంగా లక్ష్మీనరసింహస్వామి జాతర ఉత్సవాలు



అన్నదానంలో పాల్గొన్న ఎమ్మెల్యే సంజయ్

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం సత్తక్కపల్లిలో శ్రీ లక్ష్మీ నరసింహస్వామి జాతర ఉత్సవాలు ఘనంగా జరిగాయి. మంగళవారం జాతర ఉత్సవాల్లో భాగంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.అర్చకులు మాధవచారి వేదమంత్రోచ్చారణల మధ్య స్వామి వారి కల్యాణం జరపడంతో పాటు యజ్ఞం నిర్వహించారు.భక్తులు స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదం స్వీకరించారు.జాతరకు విచ్చేసిన మాజీ ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘ సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వికసిత్ భారత్ సంకల్ప యాత్ర

కోరుట్ల: పట్టణంలోని 30, 31 వార్డుల్లో మంగళవారం వికసిత్ భారత్ సంకల్పయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ పథకాలకు సంబంధించిన దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మాడవేణి నరేశ్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు బింగి వెంకటేశ్, జిల్లా కార్యవర్గ సభ్యుడు సుదవేణి మహేశ్, నాయకులు పాల్గొన్నారు.

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం కొండ్రికర్లలో వికసిత్ భారత్ సంకల్పయాత్రలో భాగంగా కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా మంగళవారం కేంద్రం అందిస్తున్న పథకాలు, వాటి ఆవశ్యకత గురించి వివరించి వాటిని సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు సూచించారు. అలాగే గర్భిణులకు సీమంతం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ రాజగంగు, ఉపసర్పంచ్ రాజేశ్వర్, ఏపీఎం విమోచన, సీహెచ్‌వో లక్ష్మి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హైమతి, కార్యదర్శి హేమలత, మాజీ ఉపసర్పంచ్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



కేంద్ర పథకాల బ్రోచర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

రాయికల్: మండలంలోని కుమ్మరిపల్లిలో వికసిత్ భారత్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం కేంద్ర ప్రభుత్వ పథకాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. పథకాలపై ప్రజలకు వివరించారు. అనంతరం కేంద్ర ప్రభుత్వ పథకాల బ్రోచర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ చింతలపల్లి స్వప్న,ఆరోగ్యమిత్ర మామిడి అంజనేయులు, ఏఎన్ఎం హేమలత, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్రీ వేంకటేశ్వర ఆలయంలో అన్నకూటోత్సవం

కోరుట్ల: పట్టణంలోని శ్రీవేంకటేశ్వర ఆలయంలో ధనుర్మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం తిరుప్పావడ సేవ(అన్న కూటోత్సవం) ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస గద్య, విష్ణు సహస్రనామ పారాయణం, తిరుప్పావై సేవాకాలం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో విక్రమ్, అర్చకులు నరసింహా చారి, ఆండాళ్ గోష్టి బృందం,భక్తులు పాల్గొన్నారు.

ఆలయాల్లో ధనుర్మాస శోభ



కోదండరామాలయంలో హారతి ఇస్తున్న మహిళలు

జగిత్యాలటౌన్: ధనుర్మాసోత్సవాలను పురస్కరించుకుని పట్టణంలోని పలు ఆలయాలు పండుగ శోభను సంతరించుకున్నాయి. మంగళవారం తెల్లవారు జాము నుంచే భక్తులు ధనుర్మాసోత్సవాల సందర్భంగా ప్రత్యేక పూజలు చేసి హారతి సమర్పించారు. ధరూర్ క్యాంపు కోదండ రామాలయానికి తెల్లవారు జామునుంచే భక్తులు ముత్యాల హారతి, పగడాల హారతి, ప్రత్యేక పూజలు చేశారు.

రెండు రోజుల్లో ఆన్‌లైన్ నమోదు పూర్తి చేయాలి

ఇబ్రహీంపట్నం: రెండు రోజుల్లో ప్రజాపాలన దరఖాస్తులను అన్‌లైన్‌లో నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని తహసీల్దార్ ప్రసాద్ డీటీపీ ఆపరేటర్లను ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో ప్రజాపాలన దరఖాస్తులను ఆన్‌లైన్ చేస్తున్నారు. మంగళవారం అన్‌లైన్ నమోదును తహసీల్దార్ పరిశీలించారు. కార్యక్రమంలో అర్ఐ గంగాధర్, సిబ్బంది పాల్గొన్నారు.




దరఖాస్తుల ఆన్‌లైన్ పరిశీలిస్తున్న తహసీల్దార్

ఆన్‌లైన్ సమర్థవంతంగా చేయాలి

మల్లాపూర్: ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను సమర్ధవంతంగా పూర్తి చేయాలని ఎంపీడీవో రాజశ్రీనివాస్ అన్నారు. ఎంపీడీవో కార్యాలయంతో పాటు అన్ని గ్రామాల్లో ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను ఆయన పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శులు, ఆపరేటర్లకు పలు సూచనలు చేశారు. దరఖాస్తులను తప్పులు లేకుండా ఆన్‌లైన్ చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీవో జగదీష్, పంచాయతీ కార్యదర్శులు, కంప్యూటర్ ఆపరేటర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

కథలాపూర్: ప్రజాపాలన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు త్వరగా చేయాలని ఎంపీడీవో జనార్ధన్ పేర్కొన్నారు. మంగళవారం కథలాపూర్ మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులతో గ్రామాల వారీగా నమోదుపై చర్చించారు. ప్రతీ దరఖాస్తును తప్పులు లేకుండా ఆన్‌లైన్‌లో నమోదు చేయించాలని కార్యదర్శులకు సూచించారు. కంప్యూటర్ ఆపరేటర్ల వద్ద ఉన్న దరఖాస్తుల వివరాలు ఎప్పటికప్పుడు సేకరించాలన్నారు. ఆయన వెంట ఎంపీవో తౌఖిర్ అహ్మద్ ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం



గొల్లపల్లి: మండల కేంద్రంలోని మోడల్‌స్కూల్‌లో 2024–25 విద్యా సంవత్సరంలో ప్రవేశానికి జనవరి 12 నుంచి ఫిబ్రవరి 22 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ప్రిన్సిపల్ రాజ్‌కుమార్ తెలిపారు. 6వ తరగతిలో 100 సీట్లు , 7 నుంచి 10వ తరగతి వరకు ఖాళీ సీట్లను భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఏప్రిల్ 8న ప్రవేశ ప్రవేశపరీక్ష ఉంటుందని, ఆసక్తి గల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

అయోధ్య రాములవారి అక్షింతలు పంపిణీ

సారంగాపూర్/మేడిపల్లి/రాయికల్/ జగిత్యాలజోన్: సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లోని వివిధ గ్రామాల్లో మంగళవారం అయోధ్య రామయ్య అక్షింతలు పంపిణీ చేశారు. భీమారం మండలంలోని కమ్మరిపేటలో మంగళవారం అయోధ్య రాములవారి అక్షింతలు ఇంటింటా పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పిట్టల లక్ష్మి, రాజారెడ్డి, గంగారాం, తదితరులు పాల్గొన్నారు.

రాయికల్ మండలంలోని ఆల్యానాయక్‌తండాలో అయోధ్యలోని శ్రీరాముని అక్షింతలను మంగళవారం ఇంటింటికీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ నందునాయక్, నాయకులు పాల్గొన్నారు.

జగిత్యాల జిల్లా కేంద్రంలో గడప గడపకు అయోధ్య రామయ్య వారి అక్షింతలను వీహెచ్‌పీకి చెందిన శ్రీరామ కర సేవకులు అందిస్తున్నారు. మంగళవారం జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత దంపతులకు శ్రీరామ కర సేవకులు అందజేశారు. అయోధ్య శ్రీరాముడి అంక్షింతలు అందుకోవడం అదృష్టంగా భావిస్తున్నానని జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత అన్నారు.

సంక్షిప్త వార్తలు

వాహనాల మళ్లింపు

ఇబ్రహీంపట్నం: జాతీయ రహదారి మెట్‌పల్లి శివారులోని వెంకట్‌రావుపేట వద్ద మంగళవారం తెల్లవారుజామున ఆయిల్ ట్యాంకర్ బోల్తా పడి మంటలు అంటుకున్నాయి. ఆయిల్ ట్యాంకర్ పేలిపాయే ప్రమాదం ఉండటంతో నిజామాబాద్, కరీంనగర్ వైపు వెళ్లే వాహనాలను మేడిపల్లి క్రాసింగ్ నుంచి ఇబ్రహీంపట్నం, గోధూర్ మీదుగా మెట్‌పల్లి వరకు నిజామాబాద్ వైపు వెళ్లే వాహనాలను మెట్‌పల్లి బస్ డిపో క్రాసింగ్ నుంచి గోధూర్, ఇబ్రహీంపట్నం మీదుగా నిజామాబాద్ వైపుగా మళ్లించారు.

పోస్టర్ ఆవిష్కరణ

మెట్‌పల్లి: జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చెకుముకి సైన్స్ సంబరాలకు సంబంధించిన పోస్టర్‌ను మంగళవారం సీఐ లక్ష్మీనారాయణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వేదిక జిల్లా అధ్యక్షుడు తులసీ ఆగమయ్య మాట్లాడుతూ విద్యార్థుల్లో సైన్స్ పట్ల అసక్తిని పెంపొందించడానికి ఈ నెల 19న పాఠశాల స్థాయిలో, 27న మండల స్థాయిలో, వచ్చే నెల 3న జిల్లా స్థాయిలో ప్రతిభ పరీక్షలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రవీందర్, చంద్రశేఖర్, నర్సింగరావు, గంగప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యమే మహాభాగ్యం

జగిత్యాల: ఆరోగ్యమే మహాభాగ్యం కార్యక్రమంలో భాగంగా జగిత్యాలలోని మానస ఎక్సలెన్స్‌లో సాత్వికాహార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆరోగ్యపరమైన 55 రకాల ఔషధమొక్కలు, 22 రకాల సుగంధ ద్రవ్యాలు, వాటి ఉపయోగాల గురించి వివరించారు. అంతేకాకుండా భారతదేశంలో వివిధ రాష్ట్రాల్లో పండించే పంటల గురించి ఇండియా మ్యాప్‌పై వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రజితరావు, డైరెక్టర్లు శ్రీధర్, హరిచరణ్‌రావు పాల్గొన్నారు.

కిట్ల అందజేత

సారంగాపూర్: మండల కేంద్రంలోని కస్తూరిబా బాలికల విద్యాలయానికి చెందిన 20 మంది బాలికలు ఖేల్ ఇండియా కిక్‌బాక్సింగ్ పోటీలకు ఎంపికయ్యారు. వారికి మంగళవారం కిట్లు అందించారు. ఈనెల 20, 21న హైదరాబాద్‌లోని లాల్‌బహదూర్ స్టేడియంలో మహిళా కిక్‌బాక్సింగ్ లీగ్ పోటీలు జరగనున్నాయి. ఈ పోటీల్లో పాల్గొనేవారికి జగిత్యాలకు చెందిన డాక్టర్ మోర సుమన్‌కుమార్ అవసరమైన బాక్సింగ్ గ్లౌసులు, హెడ్‌గార్డులు, చిన్ ప్యాడ్, షూష్ అందించారు. ఎస్సై తిరుపతి, డాక్టర్ రోజా, కేజీబీవీ స్పెషల్ అధికారి ప్రియదర్శిని, పీఈటీ వాణి తదితరులు పాల్గొన్నారు.

న్యూట్రిషియన్ కిట్ల పంపిణీ

గొల్లపల్లి: మండల కేంద్రంలోని ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు మంగళవారం న్యూట్రిషియన్ కిట్లను ప్రోగ్రామింగ్ అధికారి శ్రీనివాస్ అందజేశారు. కిట్లలో నెయ్యి, న్యూట్రిషియన్ పౌడర్ ఆహార పదార్థాల గురించి గర్భిణులకు వివరించారు. కార్యక్రమంలో వైద్యాధికారి, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రవాస భారతీయుడికి సన్మానం

జగిత్యాలరూరల్: మండలంలోని మోతెలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం ప్రవాస భారతీయ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆపి సంస్థ పూర్వ అధ్యక్షుడు ప్రవాస భారతీయుడు అయిల్నేని జగన్మోహన్‌రావును సన్మానించారు. ఈ కార్యక్రమంలో మంచాల కృష్ణ, సిరిసిల్ల శ్రీనివాస్, టీవీ.సూర్యం, కొత్త ప్రతాప్, తదితరులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు..

రాయికల్: మండలంలోని భూపతిపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న లక్ష్మయ్య, గిరిధర్ ఇటీవల బదిలీ కాగా, మంగళవారం వారిని గ్రామస్తులు, ఉపాధ్యాయులు సన్మానించారు. పాఠశాలకు చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సర్పంచ్ జక్కుల చంద్రశేఖర్, విద్యాకమిటీ చైర్మన్ రాజేంద్రప్రసాద్, హెచ్ఎం వెంకటరమణి, సింగిల్ విండో చైర్మన్ ముత్యంరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా శివ

మెట్‌పల్లిరూరల్: బీసీ సంక్షేమ సంఘం మెట్‌పల్లి మండల అధ్యక్షుడిగా వెల్లుల గ్రామానికి చెందిన మంచాల శివకుమార్ నియామకమయ్యారు. ఈ మేరకునియామక పత్రాన్ని సంఘం నాయకులు మంగళవారం ఆయనకు అందజేశారు. తన నియామకానికి సహకరించిన వారికి ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నల్ల వెంకటేశ్వర్లు,నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్ర బదిరుల సంఘం ఉపాధ్యక్షుడిగా శ్రావణ్

జగిత్యాలరూరల్: తెలంగాణ రాష్ట్ర బదిరుల సంఘం కార్యవర్గాన్ని మంగళవారం హైదరాబాద్‌లోని అబిడ్స్‌లో ఎన్నుకున్నారు. జగిత్యాల రూరల్ మండలం కల్లెడ గ్రామానికి చెందిన అంకతి శ్రావణ్‌ను రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా శ్రావణ్‌ను పలువురు అభినందించారు.

నేడు అయిలాపూర్‌లో ఎమ్మెల్యే పర్యటన

కోరుట్ల రూరల్: మండలంలోని అయిలాపూర్‌లో బుధవారం ఉదయం 7 గంటలకు ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ పర్యటిస్తారని ఎమ్మెల్యే కార్యాలయం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. గుడ్ మార్నింగ్ కోరుట్లలో భాగంగా ఎమ్మెల్యే గ్రామంలోని సమస్యలను పరిశీలించి అధికారులతో మాట్లాడుతారని ప్రకటనలో పేర్కొన్నారు.

నేడు విద్యుత్ ఉద్యోగులకు సెమినార్

కోరుట్ల రూరల్: పట్టణంలోని సినారే కళాభవన్‌లో విద్యుత్ ఉద్యోగులకు, ప్రైవేట్ ఎలక్ట్రీషియన్లకు బుధవారం సెమినార్ నిర్వహిస్తున్నట్లు టీఎస్ రెడ్కో జనరల్ మేనేజర్ ఒక ప్రకటనలో తెలిపారు. సెమినార్‌లో వివిధ రకాల విద్యుత్ పరికరాలు, వాటి వినియోగం, ప్రయోగాలు, జాగ్రత్తలు వివరిస్తారని పేర్కొన్నారు.

నేడు సామాజిక తనిఖీ ప్రజా వేదిక

ఇబ్రహీంపట్నం: మండలకేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం వద్ద బుధవారం ఉదయం 10 గంటలకు ఉపాధి హామీ పనులపై మండల స్థాయి సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ప్రభు మంగళవారం తెలిపారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
జగిత్యాల జిల్లా:
9951602934, 9000308905
Office mail : knrjagati@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
రమేష్, ACO - 7997958214
జగిత్యాల: రాజమల్లేశ్ - 9392460005
ధర్మపురి: వెంకటేష్ - 8008019205
కోరుట్ల: సురేశ్ - 7997958210
టోల్ ఫ్రీ నెం.: 1800 425 9899